ప్రజా విశ్వంభర
V3 NEWS లక్ష్యం సమాజహితం



# ప్రభాస్ 'కల్కి 2' లో దీపికా స్థానంలో సాయి పల్లవి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ టాలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన కల్కి 2898 ఏడీ మూవీ ఎంతటి ఘన విజయాన్ని నమోదు చేసిందో మనకు తెలిసిందే. 2024 లో వచ్చిన ఈ భారీ పౌరాణిక సైన్స్ ఫిక్షన్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1000 కోట్లకు పైగా వసూలు చేసింది. అయితే కల్కి 2898 ఏడీ భారీ విజయం తర్వాత ప్రేక్షకులంతా 'కల్కి 2 ది సినిమాటిక్ యూనివర్స్' కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఈ సీక్వెల్ పై రోజురోజుకూ క్రేజ్ పెరిగిపోతుంది. ఇక కల్కి 2 మూవీ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ ఇతర కమిట్ మెంట్స్ కారణంగా ఈ మూవీ షూటింగ్ చాలాసార్లు వాయిదా పడుతూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సంబంధించిన సరి కొత్త అప్ డేట్లు, కాస్టింగ్ వివరాలు ఇండస్ట్రీ వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారినట్లు స్పష్టం అవుతోంది.కల్కి 2 మూవీలో దీపికా స్థానంలో టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ సాయి పల్లవిని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమె త్వరలోనే సెట్స్ లోకి జాయిన్ కానున్నట్టు సమాచారం అందుతోంది. ఈ అక్టోబర్ లోనే సాయి పల్లవి జాయిన్ కావాల్సి ఉండగా ఈ ప్లాన్ లో ఇపుడు ఛేంజ్ వచ్చినట్టు సమాచారం. సాయి పల్లవి ప్రస్తుతం బాలీవుడ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ రామాయణ మూవీ ప్రొమోషన్స్ లో బిజీగా ఉన్న నేపథ్యంలో.. ఆ సినిమా విడుదల తర్వాత కల్కి 2 సెట్స్ లోకి వెళ్లనున్నట్టు తెలుస్తుంది. అంటే రానున్న నవంబర్ లోనే ఆమె సెట్స్ లో అడుగు పెట్టనున్నట్లు సమాచారం అందుతోంది. అయితే దీనిపై మేకర్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ.. ఆమె ఎంట్రీ దాదాపు ఖరారైన ట్లేనని ఫిల్మ్ నగర్ వర్గాలు మాట్లాడుకుంటున్నాయి.ఇక కల్కి 2 మూవీ షూటింగ్ పై ఇటీవల దర్శకుడు నాగ్ అశ్విన్ కీలక అప్డేట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అక్టోబర్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుందని తెలిపారు. చిత్రంలోని నటీనటులందరి కాల్ షీట్స్ రెడీగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది ప్రారంభంలోనే కమల్ హాసన్, అమితాబ్ బచ్చన్ కాంబినేషన్ లో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించినట్లు నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. ఇక కల్కి 2 షూటింగ్ అక్టోబర్ లో మొదలు పెట్టి వచ్చే ఏడాది ప్రథమార్ధం నాటికి కంప్లీట్ చేస్తామని నాగ్ అశ్విన్ స్పష్టతనిచ్చారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి కల్కి 2 ను భారీ స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు స్పష్టం చేశారు.





# తొమ్మిది నెలలుగా నో చెప్తున్న మృణాల్ ఠాకూర్

స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గత తొమ్మిది నెలలుగా కొత్త సినిమా ఏదీ అంగీకరించడం లేదు. అయితే అవకాశాలు లేకపోవడం వల్ల ఆమె సినిమాలకు దూరంగా ఉండటం లేదు. తన వద్దకు వస్తున్న కథలు తగినంతగా నచ్చకపోవడమే అందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. కేవలం ప్రాజెక్టులు చేయడమే కాకుండా తన మనస్సుకు నచ్చే, అర్థవంతమైన కథల కోసం వేచి చూడటానికే ఆమె ప్రాధాన్యత ఇస్తున్నారు.సినిమా నిర్మాణానికి ఎంతో సమయం, పూర్తి స్థాయి కట్టుబాటు అవసరమని మృణాల్ ఠాకూర్ విశ్వసిస్తున్నారు. అందుకే తన తర్వాతి సినిమా నటిగా తనకు సృజనాత్మక తృప్తిని అందించడంతో పాటు మంచి గుర్తింపు తెచ్చిపెట్టేలా ఉండాలని భావిస్తున్నారు. కేవలం బిజీగా కనిపించడం కోసం సినిమాలు సంతకం చేయకుండా తాను గర్వపడేలా ఉండే బలమైన పాత్రను ఎంచుకోవడమే తన లక్ష్యమని స్పష్టం చేస్తున్నారు. మృణాల్ తీసుకున్న ఈ నిర్ణయం అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్లో రాబోతున్న భారీ సినిమా 'రాకా' చుట్టూ తిరుగుతున్న రూమర్లను మళ్లీ తెరపైకి తెచ్చింది. కొంతకాలంగా ఈ ప్రాజెక్టులో ఆమె పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ.. ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తన తదుపరి ప్రాజెక్ట్ వివరాలను సరైన సమయంలో తనే స్వయంగా ప్రకటిస్తానని ఆమె ఇదివరకే స్పష్టం చేశారు.ప్రస్తుతానికి మృణాల్ ఠాకూర్ తర్వాతి చిత్రం ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఆమె పడుతున్న ఈ నిరీక్షణ ఓ ప్రత్యేకమైన, అద్భుతమైన పాత్రకు దారితీస్తుందో లేదో వేచి చూడాలి. తన రాబోయే ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను ఆమె రహస్యంగా ఉంచడంతో మృణాల్ ఠాకూర్ తదుపరి నిర్ణయంపై సినీ వర్గాల్లో, అభిమానుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.

# అనుపమతో కలిసి నటించడానికి భయమేసింది

'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం'. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న 'క్రేజీ కల్యాణం' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ పంచుకున్నాడు యంగ్ హీరో అఖిల్ రాజ్. 'నేనెప్పుడూ మంచి కథలో, మంచి సినిమాలో నటుడిగా భాగం కావాలని కోరుకుంటాను. నా క్యారెక్టర్ నిడివి ఎంత అనేది చూసుకోను. ఈ సినిమాలో నా పాత్రకు ఎంత ఎనర్జీ, పర్ఫార్మెన్స్ కావాలో అంత ఇచ్చాను. 'రౌడీ బాయ్స్' సినిమాలో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. నేను చిన్న రోల్ చేశాను. ఆ సినిమా చూస్తున్నప్పుడు 'నువ్వు హీరో అయ్యాక ఈ అమ్మాయితో కలిసి నటించు' అని మా అమ్మ చెప్పింది. ఆమె కోరుకున్నట్లే అనుపమతో నేను ఈ సినిమాలో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. ఇలాంటి మంచి చిత్రంలో నటించే అవకాశం రావడం కూడా సంతోషంగా ఉంది. అనుపమ పాత్రకు నేను ఎంత సపోర్ట్‌గా నిలబడతాను అనేది సినిమాలో చూడండి. అనుపమతో కలిసి నటించడం మొదట్లో భయమేసింది గానీ తను ఇచ్చిన సపోర్ట్‌తో హాఫ్ డేలోనే కంఫర్ట్‌గా ఫీలయ్యా. ప్రతి సీన్ చేసే ముందు నేను, అనుపమ ఎవరెలా చేయాలనేది డిస్కస్ చేసుకునేవాళ్లం. మేము నటీనటులుగా కాకుండా ఆ పాత్రల్లా చూసుకున్నాం' అని చెప్పుకొచ్చాడు అఖిల్ రాజ్.







# ఆయన ఎప్పుడొచ్చారో కూడా మాకు తెలిసేది కాదు



సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ సినిమా 'జైలర్ 2'. బ్లాక్ బస్టర్ హిట్ 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ఎంతగానో ఆకట్టుకోగా.. ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఇక హై ఎక్స్‌పెక్టేషన్స్ మధ్య ఈ మూవీ అక్టోబర్ 15, 2026 న ప్రపంచవ్యాప్తంగా తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదలవుతోంది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ సూపర్ స్టార్ రజినీకాంత్‌పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. 'నేను ఇప్పటివరకు పనిచేసిన నటులందరిలోనూ, షూటింగ్‌కు అతి తక్కువ మంది సిబ్బందితో వచ్చే వ్యక్తి రజినీకాంత్. ఆయన బృందంలోని వాళ్లు రోజుకు కనీసం ఐదుసార్లయినా మిమ్మల్ని ఆటపట్టిస్తుంటారు. మీరు కూడా వాళ్లతో ఎంతో సరదాగా గడుపుతుంటారు. నేను పని చేసిన స్టార్లందరిలోనూ మీ దగ్గరే అతి తక్కువ మంది సిబ్బంది ఉన్నారు. మీ బృందంలో ఉన్నది ముగ్గురే. అందులో ఒకరు మీరే! ఒక స్టార్ షూటింగ్‌కు వస్తున్నాడంటే సాధారణంగా అందరూ ఆయన రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తుంటారు. ఆయన హడావుడిగా, ఘనంగా రావాలని ఆశిస్తుంటారు. కానీ రజినీకాంత్ సార్ విషయంలో అలాంటిదేమీ ఉండదు. ఆయన వచ్చినట్టు ఎవరికీ తెలియదు. మేము వెనక్కి తిరిగి చూసేసరికి ఆయన అప్పటికే సెట్‌కు వచ్చి, నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ కనిపించేవారు. ఆయన ఎప్పుడొచ్చారో కూడా మాకు తెలిసేది కాదు!" అని చెప్పుకొచ్చాడు.

# గూస్‌బంప్స్ తెప్పిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'డోంట్ స్లీప్' టీజర్..




ఇంద్ర రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'డోంట్ స్లీప్'. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్, షమ్ దత్ సైనుద్దీన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. 'వి డ్రీమ్ ఫిలిమ్స్' బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ ఇస్తున్న వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ టీజర్‌ను అక్కినేని నాగచైతన్య విడుదల చేశారు. డోంట్ స్లీప్' టీజర్‌ను విడుదల చేయడం తనకు చాలా సంతోషంగా ఉందని, ఈ టీజర్ చాలా ఆసక్తికరంగా, ఎంతో పదునుగా ఉందని అక్కినేని నాగచైతన్య చెప్పారు. ఈ సినిమాతో దర్శకుడిగా మారుతున్న షమ్ దత్ గారు, తన మొదటి ప్రయత్నంలోనే సరిహద్దులు దాటి కొత్తగా సినిమా తీయడం చూడటానికి చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఇందులో చూపించిన దృశ్యాలు, కథ చెప్పిన విధానం తనకు ఎంతగానో నచ్చాయని మెచ్చుకున్నారు. అలాగే ఈ సినిమా కోసం హీరో ఇంద్ర రామ్ ఎంతగా కష్టపడ్డారో తనకు బాగా తెలుసని, ఆయన పడ్డ శ్రమ ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఆయన పడిన ఈ కష్టానికి ఖచ్చితంగా మంచి ఫలితం దక్కుతుందని తాను గట్టిగా నమ్ముతున్నానని నాగచైతన్య అన్నారు. ఇక టీజర్ విషయానికొస్తే.. ప్రారంభం నుంచే మైండ్ బ్లాకింగ్ సస్పెన్స్ ఎలిమెంట్స్, గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ సీన్స్‌తో ఆసక్తికరంగా సాగింది.

# ఒకే రకమైన పాత్రలకే పరిమితం కాను

'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని సాధించిన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే.. వరుస చాన్స్‌లతో జోరుమీదున్నారు. 'ఆపరేషన్ గంగా' అనే యాక్షన్ సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమలోకి కూడా అడుగుపెట్టబోతున్న ఈ భామ తాజాగా, ఓ ఇంటర్వ్యూలోసినిమాల ఎంపిక గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. మనం చేసే సినిమాలను ఎలా ఎంచుకుంటాం, మనల్ని మనం ప్రేక్షకులకు ఎలా చూపించుకుంటాం అనే దానిపైనే మనకు వచ్చే పాత్రలు ఆధారపడి ఉంటాయని భాగ్యశ్రీ చెప్పారు. తాను ఇప్పటివరకు 'కాంత, లెనిన్, కింగ్‌డమ్ వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో అలరించానని తెలిపారు. ఇప్పుడు నటిగా తన లక్ష్యం అన్ని రకాల పాత్రలను వెతకడం, ప్రతి సినిమాలోనూ మరింత బాగా నటించడం అని చెప్పారు. ఏ పాత్ర ఇచ్చినా సరే దానిని అద్భుతంగా చేయగలననే గట్టి నమ్మకం తనకు ఉందని తెలిపారు. అందుకే తాను ఒకే రకమైన పాత్రలకే పరిమితం అయిపోతానేమోనని ఎప్పుడూ ఆందోళన చెందనని, భిన్నమైన పాత్రలు చేస్తూ ప్రేక్షకులను అలరించడమేనని చెప్పుకొచ్చారు.
భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి వరుసగా సినిమాలు చేస్తున్నా, కెరీర్‌కు సరైన బ్రేక్ మాత్రం ఆలస్యంగానే వచ్చింది. రవితేజ హీరోగా నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఆమె.. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. అయితే భాగ్యశ్రీ గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌కు మంచి స్పందన రావడంతో అవకాశాలు మాత్రం కొనసాగాయి. అఖిల్ అక్కినేని హీరోగా నటించిన ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే భారతి పాత్రలో కనిపించింది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆమెకు చివరకు మంచి విజయాన్ని అందించింది. 'లెనిన్' విజయంతో పాటు భారతి పాత్రకు ప్రేక్షకుల నుంచి వచ్చిన ప్రశంసలు కూడా భాగ్యశ్రీకి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చాయి. ఈ సక్సెస్ తన కెరీర్‌కు ఎంతో ప్రత్యేకమని ఆమె స్వయంగా చెప్పింది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com